# రేపటి చరిత్ర

ఆ పట్టణాన్ని రెండు భాగాలుగా విభజిస్తున్నట్టుగా పెద్దరోడ్డొకటుంది. డెబ్బయి యెనభై యేళ్ల క్రితం దాని పేరేమటో యిప్పుడెవరికీ గుర్తు లేదు. ప్రస్తుతం దాని పేరు యంజీరోడ్డు. యంజీరోడ్డు అన్నది మహాత్మా గాంధీ రోడ్డు అనే మాటకు సంక్షిప్తీకరణ అని చాలా కొద్ది మందికి మాత్రమే తెలుసు. ఆ రోడ్డుకు రెండు ఫర్లాంగుల దూరంలో చిన్న నది వొకటుంది. పెద్దకాలవో, చిన్ననదో, యేదైతేనేం, యిప్పుడందులో నీటి జాలుకంటే యిసుక పర్రలే యెక్కువగా కనిపిస్తున్నాయి. పట్టణం మధ్యలో యంజీరోడ్డు దగ్గరి నుంచీ ఆ ఇసుక మేటల దాకా వ్యాపించిన పెద్ద భవనాల సముదాయం వొకటుంది. దాని వయస్సు స్వర్ణోత్సవాల్ని దాటి పోయి చాలా సంవత్సరాలైపోయింది.

రోడ్డు పక్కన ఫర్లాంగు దాకా వ్యాపించిన ఆ భవనాల ప్రహారీగోడను రకరకాల అంగళ్లూ, కార్ఖానాలూ, వ్యాపార సంస్థలూ దాదాపుగా మింగేశాయి. మధ్యలో పదిహేనడుగుల వెడల్పున్న యినుప చువ్వలగేటు మాత్రం రోడ్డుపైన దారిని మిగుల్చుకుంది. గేటుపైన అర్ధ చంద్రాకారంలో నిలబెట్టిన బోర్డుపైన వెలసిపోయిన అక్షరాలు కనిపిస్తున్నాయి. వొడ్డు లొరుసుకుంటూ పారే జనప్రవాహంలా కనిపిస్తున్న ఆ రోడ్డు పక్కన, ఆ భవన ప్రాంగణం దగ్గర మాత్రం మనుషుల పొలకువ కానరావడం లేదు.

ముందున్న వ్యాపార సముదాయాలకు భయపడినట్టుగా మట్టి బాటొకటి గేటు దగ్గరి నుంచీ బాగా మలుపుతిరిగి లోపలికి దారి తీస్తోంది. దానిపైన యిరవై అడుగులు సారించాక పాత సున్నపు కట్టడపు పోర్టికో చేరువవుతుంది. పోర్టికోకు రెండువైపులా, ఆ భవనంతో పాటూ పుట్టి పెరిగినట్టుగా కనిపిస్తున్న పెద్ద పెద్ద వృక్షాలు నిర్లిప్తంగా నిలబడి వుంటాయి. అక్కడి నుంచీ నాలుగు మెట్లెక్కి లోపలికెళ్తే, బయటి వెలుతురు నంతా లోపలి కాహ్వానిస్తూ యినపగ్రిల్ కిటికీల వసారా యింకొకటి కనబడుతుంది. వసారాకో చివర్లో కాగితాలన్నీ అతికించుకున్న నోటీసు బోర్డొకటి కనిపిస్తుంది.

* * *

తిలక్ మెట్లెక్కి పసారాలోకి వెళ్లగానే పెద్ద గాలివీచికొకటి గింగిరాలు తిరుగుతూ బరాబరులు పలికింది. మానవ సంచారం తగ్గడంతో నేలపైన తివాచీలా తయారైన దుమ్ముపొరపైన అక్కడక్కడా చెప్పుల ముద్రలు స్పష్టంగా కనిపిస్తున్నాయి, వసార కటుచివర, నోటీసు బోర్డు ముందు, యెముకలు పైకి తేలి జెముడుమొక్కల్లా కనిపిస్తున్న యిద్దరు కుర్రాళ్ళు నిలబడి వున్నారు.

"సార్! డిగ్రీ కంప్యూటర్ సైన్సు అడ్మిషన్లు క్లోజయిపోయినాయా?" జెముడు మొక్కొకటి తిలక్ ముందుకు పరిగెత్తుకొస్తూ ప్రశ్నిస్తోంది.

ఆ కుర్రాడు తనను యిక్కడ పనిచేసే లెక్చరరని అనుకుంటున్నాడని తిలక్ కర్థమయింది. తాను యీనాటి మనిషి కాదు గదా! యీ భవనాల రజతోత్సవం తానిక్కడ చదువుకుంటున్నప్పుడే కదా జరిగింది! అప్పుడు వీటికి సున్నం గొట్టించడం కోసం ప్రత్యేకంగా వారం రోజులు సెలవులివ్వాల్సి వచ్చింది. తీరా ఫంక్షన్ జరిగే రోజున చూస్తే యెరుపు రంగు రాతల్లో ప్రహరీగోడ రంగే మారిపోయింది. ఆనాటి సభలూ, నాటకాలూ, ఆటల పోటీల్లో విజయఢంకా మోగించిన ఆ విద్యార్థి పక్షాన్ని అభినందించాలో, లేకపోతే గోడలుపాడు చేసినందుకు మందలించాలో తోచకపోవడంతో ప్రిన్సిపాల్ అయోమయంలో పడిపోయాడు. అంతా దాదాపు పాతికేళ్ళ మునుపటి సంగతి. ఆనాటి రాత్రి నాటకంలో యాభైయేళ్ళ వయస్సు పాత్రను ధరించటం కోసం తిలక్ జుట్టుకు తెలుపు రంగేసి, ముఖానికి మీసాలు అతికించాల్సి వచ్చింది.

"నోటీసు బోర్డుపైన బీకాం కంప్యూటర్సు సెలక్షను లిస్టుంది సార్! కానీ దాంట్లో నా పేరు లేదు..." జెముడు మొక్క గొంతు జీరబోతోంది.

"అంటే సీటు రాలేదని అర్థం. బియ్యే జనరల్ గ్రూపు అంటే హెచ్‌యీసీ లో సీట్లు ఖాళీ వుండచ్చు. ఆఫీసులో అడిగి చూడు" అన్నాడు తిలక్.

"హిస్టరీ, యెకనామిక్స్, పాలిటిక్సు గ్రూపులో చేరితే ఫ్యూచరేముంటాది సార్? తొందరగా వుద్యోగం వచ్చే కోర్సులో చేరమంటా వుండాడు మా నాయన. లేకపోతే నేను గూడా మట్టి పిసుక్కోవలసిందే! కంప్యూటర్ కోర్సులో చేరతాను" అంటున్నాడతను.

"యీ యెయిదెడ్ కాలేజీల్లో గూడా కంప్యూటర్ కోర్సులు సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోర్సులైపోయినాయి. సమత్సరానికెంత లేదన్నా ఆరేడు వేలు ఫీజు గట్టాలి. యింకో రెండు మూడు వేలు యెక్కువగా కడితే యే ప్రయివేటు కాలేజీలోనయినా నీకు కావల్సిన కోర్సు దొరకతాది.." ముందుకు నడుస్తూ అన్నాడు తిలక్.

గత పాతికేళ్ళుగా గోడలకూ తలుపులకూ రంగులు కొట్టిన ఆనవాళ్ళు కనిపించడం లేదు. కొన్నిచోట్ల తలుపులు విరిగిన కిటికీలు వూచల్ని బయటపెడుతూ ఆస్థిపంజరపు ముఖాల్లా వికారంగా కనిపిస్తున్నాయి.

"అంత ఫీజులు కట్టలేనుసార్!" అంటూ అతను తిలక్‌ను వెంబడించబోయాడు.

"ఫీజులు కట్టలేని వాడికి కంప్యూటర్ కోర్సు మాత్రం మెందుకు? అవ్వాబువ్వా రెండూ కావాలంటే దొరకవు. హెచ్‌యీసీ చదివేసి, యేదయినా ప్రయివేటు కాలేజీకో లక్ష రూపాయలు చదివించి బియ్యీడీ కొనుక్కో. స్పెషల్ టీచరుద్యోగాలు మాత్రం యింకా కొన్నేండ్లు యియ్యకతప్పదు. అయితే పొరబాటున్నయినా యెమ్మేలూ పీహెచ్డీలూ అని పరిగెత్తద్దు. యెదురు దెబ్బలు తగిలి బొక్కబోర్లా పడతావు" అంటూ తిలక్ ప్రిన్సిపాల్ గది రెక్కల తలుపుల్ని తీసుకుని లోపలికొచ్చేశాడు.

పాత టేకు టేబులు వెనక కొయ్యతో చేసిన స్ప్రింగ్ కుర్చీ ఖాళీగా వుంది. కప్పుపైన్నుంచీ నాలుగురెక్కల పాత ఫానొకటి కదలకుండా వేలాడుతోంది. గోడపక్కన లోపలి రోలింగు షీల్డుల్ని ప్రదర్శిస్తున్న అద్దాల చెక్క బీరువా పెళ్ళినాటి కోటు తొడుక్కున్న పండుముసలివాడిలా చిత్రంగా కనబడుతోంది. ప్రిన్సిపాల్ కుర్చీవెనకున్న గోడపైన పెద్ద నిలువెత్తు ఫోటో దుమ్ముగొట్టుకు పోయివుంది. రజతోత్సవ సభల రోజున తాము ఆ ఫోటోను వేదికపైకి మోసుకెళ్ళిన సంగతి తిలక్‌కు జ్ఞాపకం వచ్చింది. ఫోటోలోని నడివయసు వ్యక్తి తొడుక్కున్న ఖద్దరు దుస్తులు ఆయన వడికిన దారంతోనే తయారు చేసినవని అందరూ చెప్పుకునే వాళ్ళు. ఆయన ముఖంలో రాజసం, దర్పం వుట్టిపడుతున్నాయి. అసలు వూళ్ళో సగానికి పైగా ఆస్థులు వొకప్పుడు ఆయనవేనంటారు. చాలా ఆస్థిని యిలా కాలేజీలకూ, టౌను హాల్సుకూ, పార్కులకూ దానంగా యిచ్చేశాడు. ఆయన మనవడు యిప్పుడు పవర్లో వున్నాడు. తాతగారు పోగొట్టిన ఆస్థినంతా తిరిగి సంపాదించాలని పట్టుబట్టాడంటారు. కొన్ని సంవత్సరాల క్రితం యీ కాలేజీ స్థలంలోంచీ కొంతయినా చేజిక్కించుకోవాలని అతగాడు కోర్టుకెళ్ళినప్పుడు పత్రికలకు రంజయిన వార్తలు దొరికాయి. అయితే పెద్దాయన సామాన్యుడు గాడు. ఆయన రాతల్ని కోర్టులు గూడా మార్చలేక పోయాయి. అప్పుడా మనవడు తనయింట్లోని తాతగారి ఫోటోలనంతా తీసిదిబ్బల్లోకి విసిరేశాడని కొందరు చెవులు కొరుక్కున్నారు. యీ గదిలోని ఫోటోలో మాత్రం ఆయన అన్నీ గమనిస్తూ నవ్వుతున్నట్టుగా తిలక్‌కు అనిపిస్తోంది.

బెదురుగా కళ్ళు మిటకరించి ఆయనకేసి చూస్తూ గదిలోంచీ బయటికొచ్చేశాడు తిలక్. పక్కనేవున్న ఆఫీసు గదిలోకి తొంగిచూశాడు.

రంగులు వెలిసిన గోడల పక్కన పాత చెక్క బీరువాలు, వాటినిండా నలిగి పుల్లగా మారిన కాగితాల దొంతరలు, గదిని యిరుకుగా చేస్తున్న విరిగిన కుర్చీలు, టేబుళ్లపైన ఫైళ్ల కట్టలు, తలుపువెనక యిసుక కుప్పపైన కుండ, దాని మూకుడు పైన ప్లాస్టిక్ గ్లాసులు, గోడపైన కదలడం మానేసిన పాత లోలకం గడియారం, దానికి కాస్తదూరంలో పాతఫ్రేముకింద దూళి తెర అడుగులోంచీ నెహ్రూ గాంధీలు పరవశంగా నవ్వుకుంటున్న ఫొటో... పాత సామాన్ల అంగడిలా కనిపిస్తున్న ఆ ఆఫీసు రూములో వో టేబులు ముందు కూర్చున్న ముసలివొంటె లాంటి వ్యక్తి పెద్ద రిజిష్టరులో యేదో గిలుకుతున్నాడు. అతడికెదురుగా మరో కుర్చీలో కూర్చున్న యువకుడొకడు టైపు చేసుకుంటున్నాడు.

"ప్రిన్సిపాల్..." తన గొంతు తనకే బిగ్గరగా వినిపించడంతో తిలక్ కంగారు పడ్డాడు.

టైపు చేస్తున్న యువకుడు తలపైకెత్తి "మీరు పియమ్మార్ కాలేజీ..." అంటూ కోడ్ భాషలో పలకరించాడు.

"అవును. ప్రిన్స్‌పాల్ పదకొండుకు రమ్మన్నాడు" అన్నాడు తిలక్.

అతను పైకి లేచి, జేబులోంచీ ఏదో కాగితం ముక్కను తీసి తిలక్ కందించాడు.

"ఆగష్టు 1945..." అంటూ ఆ కాగితంపైని అక్షరాల్ని కూడబలుక్కుంటూ చదివిన తర్వాత, అతడికేసి అయోమయంగా చూశాడు తిలక్.

"మీకైతే ఆ తేదీ యింపార్టెన్సు తెలుస్తుందని ప్రిన్స్‌పాల్ చెప్పాడు. అవసరమైతే లైబ్రరీలో రెఫర్ చెయ్యమన్నాడు. లైబ్రరీ తాళాలు నా దగ్గరే వున్నాయి..." అన్నాడతను. తాను చదువుకున్నప్పటి రోజుల్లో ఆఫీసు గదిలో వరసగా కూర్చునే గుమాస్తాలనూ, తలుపుల దగ్గర బెంచీపైన కూర్చునే బంట్రోతునూ జ్ఞాపకం చేసుకుంటూ కాలేజీ మెయిన్ బిల్డింగ్ కేసి నడవసాగాడు తిలక్.

"నా పేరు రాందాసు. యిక్కడ పార్ట్‌టైం తెలుగు లెక్చరరు." అంటూ అతను తననుతాను పరిచయం చేసుకుంటూ తిలక్‌ను అనుసరించాడు. "ఆఫీసులో టైపిస్టుపనీ, లైబ్రేరియన్ వుద్యోగమూ గూడా మనదే! గడచిన అయిదేళ్ళుగా యీ ఆఫీసులో యీ ముసలి క్లర్క్ మాత్రమే పనిచేస్తున్నాడు. మిగిలిన వాళ్లందరూ రిటైరయి పోయారు. లైబ్రేరియన్ పోస్టు నాలుగేళ్ళుగా ఖాళీగా వుంది...."

ఆఫీసు గదిని దాటి చిన్న వరండా మెట్లెక్కగానే రెండతస్థుల చతురస్రాకారపు భవనం కనిపిస్తోంది. చుట్టూ చాలా ఖాళీ స్థలముంది. లోపలికి అడుగుపెట్టగానే చుట్టూ చతురస్రాకారపు వరండా కనిపించింది. ప్రతిభుజంలోనూ వరసగా తరగతి గదులూ, గదులకంతా పొడవాటి తలుపులూ, కిటికీలూ, సున్నంతో దిట్టంగా కట్టిన గోడలూ,

యిటీవల రిపేర్లు జరిగిన చోట్లలో సిమెంటు అతుకులూ కనిపిస్తున్నాయి. భవనం మధ్యలో రెండుమూడు హాకీ మైదానాలంత పెద్ద ఖాళీ స్థలముంది. మైదానానికి అంచులా పెరిగిన అశోక చెట్లు ఆకాశాన్నందుకోవడం కోసం పోటీ పడుతున్నట్టున్నాయి. మధ్యలో అక్కడక్కడా యేనుగు తొండాల్లా వంకర్లు తిరిగిన కొమ్మలతో గుల్‌మొహర్ చెట్లు వయ్యారంగా నిల్చునివున్నాయి.

సైకిలు ట్యూబు పగిలినట్టుగా శబ్దం చేస్తూ సైరను మోగింది. అక్కడక్కడా క్లాసుల్లోంచీ కొందరు పిల్లలు వరండాలో కొస్తున్నారు. అయినా పెళ్లివాళ్లు ఖాళీ చేసిన సత్రంలా కాలేజీ బోసిగానే కనిపిస్తోంది.

మైదానం మధ్యలో కనిపిస్తున్న వొపనేర్ ఆడిటోరియం కేసి తిరిగి చూశాడు తిలక్. చుట్టూ విచ్చలవిడిగా పెరిగిన పిచ్చి మొక్కల మధ్య అది పురావస్తు శాఖ వారి ఆదరణకు నోచుకోని చారిత్రక విశేషంలా దయనీయంగా కనిపిస్తోంది.

"గ్రీకు రోమను చరిత్రకు సంబంధించిన హాలీవుడ్ సినిమాలెప్పుడైనా చూశారా మీరు! మేం చదువుకునే రోజుల్లో, చుట్టూ యెటు చూసినా స్టూడెంట్లతో, యీ కాలేజీ ఆ సినిమాల్లో కనిపించే దృశ్యాల్ని గుర్తుకు తెచ్చేది" అన్నాడు తిలక్ అరమోడ్పు కన్నులతో గత కాలంలోకి తొంగి చూస్తున్న వాడిలా.

వొపనేర్ ఆడిటోరియం దగ్గర రెండు కుక్కలు కొట్లాడుకుంటున్నాయి. పెద్దగాలి తెరవొకటి వరండాలోకి యెండుటాకుల్ని జవురుకుంటూ వెళ్తోంది. డిగ్రీ అప్లికేషను కొనుక్కోవడం కోసం మొదటిసారిగా యిక్కడికి తానొచ్చినప్పటి అనుభవం తిలక్‌కు జ్ఞాపకం రాసాగింది. అప్పట్లో జిల్లాకంతా యిదొకటే కాలేజీ కావడం వల్ల, యీ కాలేజీలో చదివి పేరు ప్రతిష్టలు పొందిన వాళ్ళ సమాచారాలు వినడం వల్ల, చదివితే యిక్కడే చదవాలని తాను పట్టుబట్టడం, అలిగి వారంరోజుల దాకా కనిపించకుండా తిరగడం, యింట్లో యిష్టం లేకపోయినా ఫీజు కట్టడం, తన చదువులకోసం తండ్రి భూమిని అమ్మాల్సిరావడం, యేదో పూర్వజన్మలో జరిగిన విషయాల్లా తెరెలుతెరలుగా అతడి ఆలోచనల్లోకి రాసాగాయి.

"యిప్పుడు యిక్కడ స్ట్రెంగ్త్ నాలుగు వందలైనా లేదు సార్! బియ్యేలో అయితే వొక సెక్షను మిగిలింది. రోల్సులో చాలా పేర్లే కనిపిస్తాయిగానీ కాలేజీకి చాలా మందిరారు. ప్రయివేటు కాలేజీల్లో సీట్లు కొనుక్కోలేని వాళ్లూ, యింకెక్కడా సీట్లు తెచ్చుకోలేని బీదా బిక్కీ జనం చేరే గ్రూపయిపోయింది బియ్యే గ్రూపు. బీకామ్, బీయెస్సీల్లో యింకా కొందరు చేరుతున్నారు కాబట్టి కాలేజీ యీ మాత్రమైనా మిగిలింది" అన్నాడు రాందాసు వరసగా తాళాలు తగిలించిన తరగతి గదులముందు నడుస్తూ.

"మా రోజుల్లో బియ్యే హెచ్‌యీసీ గ్రూపుకు రాయల్ గ్రూపని పేరు. లాబ్‌లూ, రికార్డులూ అని గొడవపెట్టే వాళ్లు లేక పోవడంతో మాకు తీరికెక్కువ. యేదో పిక్నిక్కొచ్చినట్టుగా రెండుమూడు పుస్తకాలు చేతబట్టుకుని కాలేజీ కొచ్చేవాళ్ళం. పరీక్షలప్పుడు చదివితే చాలని మా ధైర్యం. డ్రామాలూ, స్పోర్ట్సులూ, యెక్స్‌ట్రా కరికులర్ యాక్టివిటీస్ లోనంతా మేమే కనిపించేవాళ్లం పాత స్టూడెంటొకాయిన గుర్తు చేస్తేనే యీ కాలేజీ వాళ్లకు సిల్వర్‌జూబ్లీ గడువుదాటి పోయినట్టు తెలిసింది. అందుకే ఆరు సంవత్సరాలు ఆలస్యంగా ఫంక్షను జరిపారప్పుడు". మాట్లాడుతూ మాట్లాడుతూ ఆగస్టు 1945 సంగతి గుర్తుకు రాగానే టక్కున ఆగిపోయాడు తిలక్.

తుప్పు పట్టిన బీగం వేలాడుతున్న హాలుపైన 'ఫిజిక్సులాబ్' అనే అక్షరాలున్న బోర్డులో సగం చెదలు పట్టిపోయివుంది. దాని విరిగిన కిటికీ యెలుకలూ, తొండలూ తిరిగే ద్వారంగా మారిపోయినట్టుంది. అక్కడ యెక్స్‌పెర్మెంట్లలో మునిగిపోయిన స్నేహితుడ్ని బలవంతంగా సినిమాకు లాక్కెళ్లిన సంగతి జ్ఞాపకం రాగానే తిలక్ పెదవులపైకో నవ్వు వచ్చి కూర్చుంది. విరిగిన కిటికీ తలుపుల గుండా లోపలికి తొంగి చూశాడు తిలక్. పెద్ద టేబుళ్లూ, కప్‌బోర్డులూ, అన్నీ దుమ్ము గొట్టుకుపోయివున్నాయి. అటువైపు చివర్లో తుప్పు పట్టిపోయిన ఆక్సిజన్ ప్లాంట్‌పైన గుడ్ల గూబ కనబడగానే అతను వులిక్కిపడ్డాడు.

"యిక్కడ పనిచేసే ఫిజిక్సు లెక్చరర్ని కోచింగు సెంటరువాళ్లు లీవుపైన తీసుకెళ్లి పోయారు సార్! యిక్కడ అయిదారేళ్లయినా సంపాదించలేనంత మొత్తాన్ని ఆయనక్కడ సంవత్సరంలో కళ్లజూస్తున్నాడు. యెంత యెఫిషయన్సీ వుంటే అంత డిమాండ్. యిప్పుడు యిద్దరు పార్ట్‌టైం ఫిజిక్సు లెక్చరర్లున్నారు. క్లాసు వర్కుకే వాళ్లకు టయం చాలడం లేదు. లాబ్ టెక్నీషియన్ రిటరై చాలా రోజులై పోయింది. లాబ్‌ను తెరవాల్సిన పనేలేదు.." అన్నాడు రాందాసు.

పక్కనే తాళాలు తగిలించుకున్న మరో గదిపైన 'కెమిస్ట్రీ లాబ్' అన్న బోర్డు కనబడుతోంది. దానికేసి బెరుకుగా చూస్తూ "యీ పక్కనే గాంధీ హాలుండాలి గదా!" అని వాకబు చేశాడు తిలక్.

అక్కడ అద్దాలు తగిలించుకున్న అల్యూమినియం తలుపులు రెండు కనిపిస్తున్నాయి. వాటి ముందు రకరకాల చెప్పులజోళ్లు కొలువుతీరివున్నాయి. గదిలోపల ఫ్లోరసెంటు దీపాలు వెలుగుతున్నాయి. రెండువరసలుగా అమర్చిన టేబుళ్లముందు కూర్చున్న విద్యార్థులు కంప్యూటర్ తెరల్లో యేదో వెదుక్కుంటున్నారు. గాజు తలుపుల్ని తోసుకుంటూ బయటికొచ్చిన వ్యక్తి "గుడ్‌మార్నింగ్ సార్!" అంటూ తిలక్‌ను పలకరిస్తున్నాడు.

"హలో మీరా సార్! మీరిక్కడ కూడా టీచ్ చేస్తున్నారా?" అని అడిగాడు తిలక్.

"అవును సార్! టూ పీరియడ్స్ మాత్రమే! సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సు గదా! స్టూడెంట్లు వొకరు గూడా ఆబ్సెంటు కారు. పనెక్కువ" అంటున్నాడతను.

గాజు తలుపుల మధ్యలోంచీ పుట్టుకొచ్చిన తలొకటి "సార్! యీ యెమ్మెస్ వర్డులో" అని గీ పెడుతోంది. "కలుస్తాను సార్...బై" అంటూ అతను మళ్లీ లోపలికెళ్లిపోయాడు.

"మార్నింగ్ యిక్కడ రెండుగంటలు. మధ్యాహ్నం సియమ్మార్‌లో రెండుగంటలు. యీయన పనే బాగుంది కదా!" అన్నాడు తిలక్ స్వగతంగా.

ముందు కనిపిస్తున్న ద్వారమూ, తలుపులూ యీ మధ్యే యేర్పాటు చేసినవని తెలిసిపోతోంది. అందుకే పొట్టిగా, బలహీనంగా కనిపిస్తున్నాయి. పైన 'లైబ్రరీ' అన్న బోర్డుంది.

"గాంధీ హాలెక్కడ?" అని విస్తుపోయాడు తిలక్. రాందాసు లైబ్రరీ హాలు తలుపులు తెరుస్తున్నాడు. లోపలికి నడవగానే సున్నమైనా పూయని సిమెంటు గోడ కనిపించింది తిలక్‌కు.

"యిదంతా గాంధీ హాలే!" అన్నాడు తిలక్ గుర్తుపట్టిన ఆనందంతో కేరింత గొట్టినట్టుగా. "అటు కంప్యూటర్ లాబ్ దగ్గరి నుంచీ యిదంతా వొకప్పుడు వొకే పెద్దహాలు. యీ సంగంలో లైబ్రరీ వుండేది. అటు సగమంతా ఖాళీగా వుంచి చిన్న చిన్న సమావేశాల కోసం వాడు కునేవాళ్ళు. ఆ చివర్లో చిన్నస్టేజీ, పోడియమూ వుండేవి. ఆ గోడపైన గాంధీ ఫోటో వుండేది. యిదిగో యిప్పుడీ గోడపైన తగిలించారు చూడండి. అదే యిది! యిలా దగ్గరికొచ్చి చూడండి. యీ ఫోటో యిదే చోట్లో, యీ కాలేజీ బిల్డింగు కట్టకముందు జరిగిన మీటింగులో తీశారు. ప్రీ యిండిపెండెంట్‌డేస్‌లో యీ వూరి మీదుగా వెళ్తూ గాంధీ యిక్కడే ఆగాడు. ఆ మీటింగులోనే యీ కాలేజీ పౌండరు, ప్రిన్స్‌పాల్ గదిలో ఫోటోలో వున్న పెద్దాయన, గాంధీకి ఫ్రీడం స్ట్రగుల్ కోసమని యిరవై అయిదువేల డొనేషన్ యిచ్చాడు. అంతా రికార్డుల్లో వుంది. దాని గుర్తుగానే కాలేజీ కట్టిన తర్వాత, యీ హాలుకు గాంధీ పేరు పెట్టారు.

చెప్పడం ఆపి వెనుదిరిగి చూశాడు తిలక్. పుస్తకాల అలమారా దగ్గర తచ్చాడుతున్న రాందాసు అతడి మాటల్ని వింటున్నాడో లేదో తెలియడం లేదు.

తిలక్ గూడా రెండు మూడు వరసల్ని గాలించిన తర్వాత "నేను పీహెచ్డీ చేసినప్పుడు యిక్కడ చాలా పుస్తకాలు దొరికాయి. అవన్నీ యిప్పుడు కనిపించడం లేదు... యేమయ్యాయి?" అని ప్రశ్నించాడు.

"మీ రీసెర్చిటాపిక్ మీది సార్?" అని అడిగాడు రాందాసు.

"నా టాపిక్... మరి..." అంటూ పెద్దగా నవ్వేశాడు తిలక్. "యీనాటి సంగతా చెప్పండి. పొడవాటి టాపిక్కు... నైన్టీన్త్, ట్వంటియత్ సెంచరీల్లో ఆంధ్రప్రదేశ్‌పైన యిండియన్ రినయజాన్స్ ప్రభావం... కొంచెం అటూ యిటూగా అదీ నా టాపిక్!"

"పోయిన యెలెక్షన్లప్పుడు యీ కాలేజీలోనే కౌంటింగ్ సెంటరు పెట్టారు సార్! యీ హాల్లో అయితే కన్వీనియంట్‌గా వుంటుందని పుస్తకాల్ని పక్క గదిలోకి పంపించారు. ఆ ట్రాన్స్‌పోర్టులో చాలా పాత పుస్తకాలు చినిగిపోయాయి... యిప్పుడు యిలాంటి ప్రయివేట్ యెయిడెడ్ కాలేజీలకు గవర్మెంటిచ్చే గ్రాంటు తగ్గిపోయింది సార్! వొకప్పుడు ఫారిన్ జర్నల్సు గూడా వచ్చేవి. యిప్పుడు డైలీ న్యూస్ పేపరు గూడా కష్టంపైన తెప్పిస్తున్నారు. అయితే యిప్పుడీ లైబ్రరీలో మిగిలినవన్నీ చాలా వ్యాల్యుబుల్ బుక్స్. యేమారితే కొట్టుకు పోతారు. అందుకని క్లోజ్డ్ యాక్సెస్ చేసేశారు. యిష్యూ చేసేందుకు యెంప్లాయీ యెవరూ లేరు..." చెబుతూనే వరండాలో కొచ్చేశాడు రాందాసు.

"ఆగష్టు 1945... ఆగష్టు 1945..." అని స్మరిస్తూ తిలక్ గూడా లైబ్రరీలోంచీ వెలుపలి కొచ్చేశాడు. తలుపులకు తగిలించిన బీగాన్ని రెండుమూడుసార్లు లాగి చూశాక రాందాసు ముందుకు కదిలాడు.

అక్కడేదో తెరిచిన తరగతి కనిపిస్తోంది. క్లాసులో పలచగా వున్న పిల్లల్ని చూసి "బియ్యెస్సీ యేమో సార్! బియ్యేవాళ్లయితే యెప్పుడో జారుకునేవాళ్లు " అన్నాడు రాందాసు.

భవనం వెనక వైపున్న గేటు విరిగిపోయివుంది. దూరంగా యేటి పక్కన బీదవాళ్లు కట్టుకున్న గుడిసెలు కనిపిస్తున్నాయి. మైదానమంతా పిచ్చి చెట్లు పెరిగిపోయి వున్నాయి. టెన్నిస్ కోర్టులో జిల్లేళ్లు బలిసిపోయివున్నాయి. అటువైపు విరిగిన హాకీ గోల్స్‌పోల్సు వాటి మధ్య ఆటస్థలముండేదని చెబుతున్నాయి. విరిగిన బాస్కెట్‌బాల్ బోర్డుపైకి తీగలు పాకడంతో అదేదో వింత మొక్కలా కనబడుతోంది. క్లాసుకు గూడా హాకీస్టిక్ తీసుకొచ్చే జాన్సన్ గుర్తుకొచ్చాడు తిలక్‌కు. తర్వాత వాడికి స్పోర్ట్సు కోటాలో బాంకు వుద్యోగం వచ్చిందని తెలిసింది. యిప్పుడు బాంకుకు గూడా హాకీ స్టిక్ తీసుకెళ్తున్నాడేమో! తనతో బాటూ చదువుకుని స్టేట్‌కు రెప్రెజెంట్ చేసిన ఫుట్‌బాల్ ఆటగాడు జావేద్ యిప్పుడేం చేస్తున్నాడోనన్న అనుమానం వచ్చింది తిలక్‌కు. గుడిసెల పక్కన చిన్న కుర్రాళ్లు కొందరు మూడు కర్రలు పాతి క్రికెట్టాడుకుంటున్నారు. చిరిగిన బట్టలు, బక్క శరీరాలు... బహుశా ఆ స్లమ్స్ పిల్లలైవుంటారు.

నార్త్ బ్లాక్ వైపుకు తిరిగి ఆఫీసుకేసి నడవసాగాడు తిలక్. అటువైపున్న మొదటి గదిలో డెస్కు కొకరు చొప్పున కూర్చుని పరీక్ష రాస్తున్న విద్యార్థులు కనిపించారు. "వోపన్ యూనివర్సిటీ పరీక్ష సార్!" అంటున్నాడు రాందాసు.

"గుడ్ ఆఫ్టర్‌నూన్ సార్!" హాలులోని యిన్విజిలేటర్లలోంచీ వొకతను వరండాలోకి దూసుకొస్తున్నాడు. "యిలా వచ్చారేంటి సార్! రండి మా స్టాఫ్ రూంకు కాఫీ తాగి వెళ్దురు గానీ! నాది యిన్విజిలేషన్ డ్యూటీ వూరికే గాదులెండి. సెషన్‌కు ఆరవై యిస్తారు. అయినా ఆ మాత్రం రెమ్యూనిరేషన్‌కు యిక్కడెవరూ పోటీ లేరు లెండి. వాళ్లకు క్లబ్బులూ, ప్రయివేటు బిజినెస్సులూ వున్నాయి. క్షణం తీరికుండదు..." సమాధానం కోసం యెదురు చూడకుండా స్టాఫ్ రూం తలుపులు తెరుస్తున్నాడతను.

ఖాళీగావున్న పెద్ద గదిలో కొన్ని ఆసనాలు మాత్రమే వున్నాయి. "కూర్చోండి సార్.. ప్యూన్ టీకి వెళ్ళాడు. వచ్చేస్తాడు... మా అమ్మాయి స్వప్న, మీ పియమ్మార్‌లో థార్డ్‌యియర్ కంప్యూటర్స్‌లో వుంది సార్..." అంటున్నాడతను.

"యిది యింగ్లీషు డిపార్టుమెంటే గదా సార్!" అని అడిగాడు తిలక్ చుట్టూ కలయజూస్తూ.

"అవునుసార్! వొకప్పుడు అన్ని డిపార్ట్‌మెంట్ల మాదిరే యిది గూడా పెద్ద డిపార్ట్‌మెంట్. అందరూ రిటైరై పోయినారు. నాదే లాస్ట్ వికెట్. యింకో అయిదేళ్లలో నేనూ రిటైరైపోయానంటే యీ యిన్నింగ్సు క్లోజయిపోతుంది..." అంటూ కిలారించాడతను. తర్వాత "మీ పియమ్మార్ నుంచీ యిక్కడికొస్తే యిండియా నుంచీ సైబీరియా కొచ్చినట్టుగా యిబ్బందిగా వుందా సార్!" అని పరామర్శించాడు.

"నిజమేసార్! పియమ్మార్ డిగ్రీ కాలేజీ బిల్డింగు వొకప్పుడు త్రీ బెడ్ రూం రెసిడెన్షియల్ హవుస్సే గదా!" అని అందుకున్నాడు రాందాసు. "లీజుకు తీసుకున్నాక ఆ బిల్డింగుపైన రెండంతస్థుల్లో షెడ్లు వేసుకున్నారు. యిప్పుడక్కడ స్ట్రెంగ్త్ వెయ్యిదాకా వుందని విన్నాను. స్పేసు చాలక రెండు షిఫ్టుల్లో నడుపుతున్నారు."

"సార్! మీ కోసం కాలేజీకే రావాలనుకున్నాను. నాదో రిక్వెస్టు" వీలయినంత వినయంగా చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు యింగ్లీషు లెక్చరరు. "మీ కంప్యూటర్ లాబు మెయిన్ బిల్డింగుకు రెండు ఫర్లాంగుల దూరంలో పెట్టారు గదా! క్లాసయ్యాక లాబ్‌కెళ్లాలంటే మెయిన్ రోడ్డుపైన నడచి వెళ్ళాలి. రెండువైపులా బ్రాందీ షాపులూ, హోటళ్లూ .. ఆడపిల్లలు గదా!యిబ్బందిగా వుందంటున్నారు" పైగా లాబ్ షాపింగ్ కాంప్లెక్సు నాలుగో అంతస్థులో

వుంది. అన్ని మెట్లెక్కి దిగడం కష్టమంటున్నారు. రోడ్డుపైన వెళ్లే ట్రాఫిక్ డిస్ట్రబెన్స్ భరించలేక పోతున్నారు."

"అదంతా బీయల్ఆర్ కాలేజీ వాళ్లు చేస్తున్న బాడ్ ప్రాపగాండా సార్!" విసుగ్గా అడ్డుతగిలాడు తిలక్. "వాళ్ల కాలేజీయెక్కడుందో చూడండి. డ్రైనేజీ కాలవలోనే వున్నట్టు లెక్క. నిజానికది పెళ్ళిళ్ల సత్రమే గదా! పెళ్ళిళ్ళు జరిగినప్పుడంతా కాలేజీకి లీవులిస్తారు. ఆ క్లాసు రూముల కంటే కలకత్తా చీకటి గదులే మేలు. అయితే మా కాలేజీ కెప్పుడూ బెటర్ రిజల్ట్సు వస్తాయని వాళ్ల జెలసీ! వాళ్లకు తోడు ఆ యీ యస్ యన్ డిగ్రీ కాలేజీ వాళ్లు కూడా మా పైన కక్ష కట్టినారు. కానీ మా కరెస్పాండెంటు సంగతి మీకు తెలియదు. అవసరమైతే ఢిల్లీ దాకా వెళ్లేందుకాయన రెడీ! అదంతా మీకెందుకు చెప్పండి! మీ అమ్మాయికి యింకే కాలేజీలో చేర్పించినారానంత మంచి రాంకు తెప్పించే పూచీ నాది!"

టేబులు పైకొచ్చిన టీకప్పు నందుకుంటూ "మీరోసారి కరెస్పాండెంటుగారికి చెప్పి చూడండి సార్!" అన్నాడు యింగ్లీషు లెక్చరరు.

సరేనన్నట్టుగా తలూపుతూ టీ గుటకేశాడు తిలక్. లెక్చరరు దగ్గరి నుంచీ వీడ్కోలు తీసుకుని యింగ్లీషు స్టాఫ్ రూం బయటికొచ్చేశాక "మా ప్రిన్స్‌పాల్ షఫీగూడా బాలాజీ కాలనీలో ప్రయివేటు జూనియర్ కాలేజీ స్టార్ట్ చేస్తున్నాడు సార్! దాని కోసం వాళ్ల యింటిని రీమాడల్ చేయిస్తున్నాడు. బహుశా యిప్పుడడిక్కడికే వెళ్లుంటాడు" అని చెప్పాడు రాందాసు.

పక్కన హిస్టరీ స్టాఫ్ రూం కనిపించగానే తిలక్ గుండెలు వుద్వేత్తుగా కొట్టుకోసాగాయి. తనకు పాఠాలు చెప్పిన ఆరేడు మంది లెక్చరర్లు జ్ఞాపకం రాసాగారతనికి. యూరోపియన్ హిస్టరీని అలవోకగా చెప్పుకుపోయే హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంటు గుర్తుకొచ్చాడు. టైమ్ మిషను లాంటిది దొరికి పాతికేళ్లు వెనక్కు వెళ్ల గలిగితే, ఆయన్నడిగి ఆగష్టు 1945 గురించి తెలుసుకోవాలనిపించ సాగిందతడికి.

"మీరు గవర్మెంటు జాబు కోసం ప్రయత్నం చెయ్యలేదా సార్?" అని అడుగుతున్నాడు రాందాసు.

"యేం యే చేసిన తరువాత రీసెర్చిపైకి గాలి మళ్ళకపోయి వుంటే జూనియర్ కాలేజీ లెక్చరరయి వుండేవాణ్ణి. సెవెంటీ నైన్‌లో పీహెచ్డీ కోసం పరిగెత్తకపోయి వుంటే డిగ్రీ లెక్చరరుద్యోగం వచ్చుండేది. పీహెచ్‌డీ వచ్చిం తర్వాత యూనివర్సిటీ జాబు కోసం ప్రయత్నం చేసి వుండకపోతే యేదో వొక యెయిడెడ్ కాలేజీ జాబ్ నాదయ్యేది. యూనివర్సిటీల్లో జరిగిన రెండు రెక్రూట్‌మెంట్లనూ రెకమెండేషన్లూ, లంచాలూ

యెగరేసుకుపోయినాయి. యీ లోపల చెయ్యికాలింది. లాస్టు పదేళ్లుగా గవర్మెంటు రెక్రూటుమెంట్లే లేవు...” చెబుతూ చెబుతూ యెదురుగా వోకుర్రాడు రాగానే ఆగిపోయాడు తిలక్. అతను దాటిపోయిన తర్వాత “సడన్‌గా చూసి మా పెద్దబ్బాయనుకున్నాను. మా వాడు యింజనీరింగ్ సెకెండ్ యియర్ చదువుతున్నాడు” అంటూ గొణిగాడు.

పలచగా పిల్లలు కనిపిస్తున్న నాలుగు తరగతి గదుల్ని దాటిన తర్వాత మళ్లీ మెయిన్ బిల్డింగు ముఖ ద్వారం చేరువయ్యింది.

ఆఫీసుగదిలో ముసలి క్లర్కు యింకా ఫైళ్లల్లోకే చూస్తున్నాడు.

అవతల ప్రిన్స్‌పాల్ గదిలోంచీ మాటలు వినబడుతున్నాయి.

“ప్రిన్సిపాల్‌కు నా గురించి కొంచెం మంచిగా చెప్పండి సార్! అసలే తెలుగు లెక్చరర్ని. ఆయన చెప్పిన పనులన్నీ చేస్తున్నాను. అయినా లెక్కలేనంత మంది యీ పార్ట్‌టైం జాబుకు పోటీ పడుతున్నారు” అంటూ తిలక్‌ను ప్రాధేయపడిన తర్వాత ఆఫీసు గది లోకెళ్లి టైపుమిషను ముందు కుర్చున్నాడు రాందాసు.

లాండ్ ఫోన్‌లో మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ తిలక్‌ను లోపలికి రమ్మన్నట్టుగా తలూపాడు. అతనివెనక ఫొటోలోని కాలేజీ ఫౌండరు తనకేసి చూసి అదోలా నవ్వుతున్నట్టుగా అనిపించింది తిలక్‌కు. ప్రిన్స్‌పాల్ ఫోన్లో సిమెంటు. గ్రావెల్, ఐరను అని కలవరిస్తున్నాడు. తీరిగ్గా మాట్లాడడం ముగించిన తర్వాత, అతను సీటు వెనక్కువాలి, కుర్చీని గుండ్రంగా తిప్పుతూ “చెప్పండి. ఆగష్టు 1945 కదా? యేమిటది?” అని అడిగాడు.

“లైబ్రరీలో గూడా వెతికాను సార్. హింటేమీ దొరక లేదు...” అన్నాడు తిలక్.

ప్రిన్స్‌పాల్ టేబులు సొరుగులోంచి కవరు లాగి తిలక్ చేతి కందిస్తూ. “లాస్ట్‌వీక్ వచ్చింది. యెవరో వోల్డు స్టూడెంటు. జపాన్‌లో యేదో యూనివర్సిటీలో ఫిజిక్సు ప్రొఫెసర్‌గా వున్నాడు. యిక్కడ తన తండ్రి పేరు మీద యెండోమెంటు లెక్చరుస్పాన్సరు చేయాలను కుంటున్నట్టుగా రాశాడు....” అన్నారు.

యింగ్లీషులో రాసిన వుత్తరాన్ని రెండుమూడుసార్లు చదివిన తర్వాత “ఆగష్టు 1945 మన కాలేజీకే గాకుండా ప్రపంచానికంతా మరువరాని గుర్తయి పోయిందంటున్నాడు సార్! మంచి నుంచీ యిన్‌స్పయిరై, చెడు నుంచీ గుణపాఠం నేర్చుకోవాలంటే ఆడేట్‌ను జ్ఞాపకం పెట్టుకోవాలని రాశాడు...” అని చెప్పాడు తిలక్.

“యే టాపిక్‌పైన లెక్చర్ పెట్టమంటాడో క్లియర్‌గా చెప్పేడవచ్చుగదా! మీలాంటి హిస్టరీ స్కాలర్లకు గూడా అర్థం గాకుండా రాస్తే యెలా చెప్పండి. స్పష్టంగా రాయమని వుత్తరం రాస్తాను...” అన్నాడు ప్రిన్స్‌పాల్. తర్వాత “యెవరైనా ఫిజిక్సూ, మాథ్సూ బాగా

చెప్పేవాళ్లుంటే చూడండి. మా వాడు వచ్చే జూన్‌కైనా జూనియర్ కాలేజీ బిగిన్ చెయ్యాలని అంటున్నాడు. వీలయినంతలో బాగానే పే చేద్దామను కున్నాం!" అన్నాడు.

కాస్సేపాగాక "నలుగురైదుగురున్నారుసార్! రెండు రోజుల్లో లిస్టు తెచ్చిస్తాను" అన్నాడు తిలక్. ప్రిన్స్‌పాల్ డైరీ తీసి యేదో వెదుక్కుంటున్నాడు. "నాదో రిక్వెస్టుంది సార్ ...యిక్కడ మీ కాలేజీలో హిస్టరీ పార్ట్‌టైం ఖాళీగావుందని..." అంటూ జీరబోతున్న గొంతుతో చెప్పడానికి ప్రయత్నించాడు తిలక్. "కాండిడేట్ యెవరు?" అని అడిగాడు ప్రిన్స్‌పాల్.

"నేనే సార్! పియమ్మార్‌లో హిస్టరీ సబ్జెక్టెందుకుంటుందిసార్! ప్రయివేటు కాలేజీల్లో హిస్టరీ లెక్చరరవసరం వుండదు గదా! నాది ప్రిన్స్‌పాల్ పోస్టుమాత్రమే! నిజానికి ఆ పని గూడా కరెస్పాండెంటే చేసుకుంటాడు. పీహెచ్డీ చేసిన డాక్టరేటు ప్రిన్స్‌పాలుంటే ఆ కాలేజీకే పెద్ద గ్లామరు. అందుకని నన్నపాయింట్ చేసుకున్నారు. కానీ వాళ్లిచ్చే సాలరీ యేం చాలుతుంది సార్! సాయంత్రం యే హెచ్‌పీ ట్యుటోరియల్స్‌లో రెండు గంటలు జనరల్ నాలెడ్జీ, కరెంటఫయిర్సూ టీచ్ చేస్తాను. కానీ హిస్టరీ మదర్ సబ్జెక్టు. టచ్‌పోకుండా వుండాలని...." క్రమంగా తనగొంతు మూగబోవడంతో ఆగిపోయాడు తిలక్.

ప్రిన్స్‌పాల్ అతడికేసి కన్నార్పకుండా చూస్తూ "మీరే మేలు! యీ వయసుకే ప్రిన్స్‌పాల్ అయ్యారు. నేనింకో ఆర్నెల్లల్లో రిటైరవబోతున్నాను. నా డెసిగ్నేషను ప్రిన్స్‌పాల్ ఫుల్ యెకనామిక్ పవర్స్ అని. అంటే యించార్జిగానే రిటైరవబోతున్నాను. గవర్మెంటు కొత్త రిక్రూట్‌మెంట్లతో బాటూ ప్రమోషన్లు గూడా ఆపేసింది. యీ యెయిడెడ్ కాలేజీల్లో నా మాదిరి సీనియర్లంతా యీన్చార్జీలుగానే యింటికెళ్లాల్సిందే. ప్రిన్స్‌పాల్‌గా రిటైరైతే పెన్షనెక్కువగా యియ్యాల్సి వస్తుందని వాళ్ల బాధ..." అంటూ నిట్టూర్చాడతను. తర్వాత "యిప్పుడు బియ్యే హెచ్‌యీసీలో వొకేసెక్షనుంది. మూడు సంవత్సరాలకూ కలిపి నాలుగు క్లాసులు. మొన్ననే వో పార్ట్‌టైంను అపాయింట్ చేశాను. యిద్దరూ వుండే వర్కు పంచుకోండి. గంటకు హండ్రెడ్ సాంక్షను జేస్తాను" అన్నాడు.

"థాంక్యూ సార్!" అన్నాడు తిలక్ గొంతు పెగుల్చుకుని.

"యెవరైనా యెలక్ట్రానిక్సు చెప్పేవాళ్లుంటే చూడండి. యీ కాలేజీకే కావాలి... గవర్మెంటు యిలాంటి రెప్యూటెడ్ ప్రయివేటు కాలేజీలను గ్రాంట్‌యిన్ యెయిడ్ కిందికి తీసుకొనిరాకుంటేనే మేలుగా వుండేది. యిప్పుడు దీనికి వాళ్లియ్యాల్సిన కంఫర్ట్సూ, ఫెసిలిటీస్ యియ్యడం లేదు. ప్రయివేటు వాళ్లకుండే మార్కెట్లు మార్గాలూ వుండవు. నేను వెళ్లేలోగా దీనికో ఫేస్‌లిఫ్ట్ యియ్యాలని నా తాపత్రయం. లేకపోతే యిట్ విల్ హెడ్‌టువర్డ్సు యిట్స్ నేచురల్ డెత్..." అంటున్నాడు ప్రిన్స్‌పాల్.

టీ కప్పులు టేబులుపైకి వచ్చాయి. ప్రిన్స్‌పాల్ టీ తాగుతూ చెప్పుకుపోతున్నాడు. "పై వాళ్లతో పోట్లాడి సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులు తెస్తున్నాను. వెస్ట్‌బ్లాక్‌లో యెలక్ట్రానిక్సు లాబ్ పెట్టిస్తున్నాను. అదీ, కంప్యూటర్ లాబ్ తప్పితే మిగిలిన బిల్డింగంతా పాత బడి భూత్ బంగాళాలా తయారయింది. ఫ్రీగా చెప్పితే చదువు వాల్యూ తెలియడం లేదు. డిమాండుండే కోర్సులనంతా మెల్లగా సెల్ఫ్ సపోర్టెడ్ కోర్సులుగా మారుస్తున్నారు. కొన్ని సంవత్సరాల తర్వాత ఫ్రీ కోర్సులే వుండవు. అన్నీ సెల్ఫ్ సపోర్టెడ్ కోర్సులే అయిపోతాయి. పర్మినెంట్ లెక్చరర్లుండరు. అన్నీ కాంట్రాక్టు బేసిస్‌లో వుంటాయి. హ్యూమానిటీస్ లాంటి నాన్‌ప్రొడెక్టివ్ కోర్సు లెందుకు? దండగ! బిల్డింగు మెయింటెనెన్సు కష్టంగా వుంది. ప్రయివేటు వాళ్ల పరంజేస్తే దెబ్బకు దెయ్యం వదలి పోతుంది. వాళ్లయితే దీనికి అల్యూమినియం షీట్లూ, గ్లాసుప్లేట్లూ ఫిట్ చేసి సైబర్ సెంటర్‌లాగా తయారు చేసేస్తారు. అకడిమిక్ అఫయిర్సు గూడా ప్రయివేటు మేనేజ్‌మెంట్‌కిస్తే అన్నీ ప్రాఫిట్ వోరియంటెండ్‌గా చూసుకుంటారు. ప్లేగ్రౌండు పేరుతో యింత ఖాళీ స్థలాన్ని వృధా చేయడం అప్పుడు కుదరనే కుదరదు..."

ఆయన భవిష్యద్దర్శనం కొనసాగుతూ వుండగానే తిలక్ పైకి లేచి "సీ యూసార్!" అని అరిచాడు. అతను విస్తుపోయి చూస్తూ వుండగా గది బయటికొచ్చేశాడు.

వరండాలో నోటీసు బోర్డు ముందు మరో రెండు కొత్త జెముడు మొక్కలు నిలబడివున్నాయి.

పోర్టికోలో కొత్త నల్లరంగు కారొకటి నిలబడివుంది. బహుశా ప్రిన్స్‌పాల్‌దై వుంటుంది. యిప్పుడే యీత గొట్టి వచ్చిన యెనుబోతులా నిగనిగలాడుతోంది. దానికి సమాంతరంగా పోర్టికో స్థంభం కింద, గోడలోంచీ పాతరాతి పలకమొకటి దిగాలుగా కనిపిస్తోంది. వులిక్కిపడి దానికేసి తేరిపారజూశాడు తిలక్. కాలేజీ శంఖుస్థాపన శిలా ఫలకంపైన '9 ఆగష్టు 1945' అన్న అక్షరాలు నలుపూ తెలుపూ మచ్చలతో వికృతంగా కనిపిస్తున్నాయి.

కావాల్సిన సమాచారం దొరికిన సంబరంతో తిలక్ గబగబా ప్రిన్స్‌పాల్ గదికేసి నడవబోయాడు. యింతలోనే అదే విషయంతో ముడిబడ్డ మరోప్రశ్నకు సమాధానం తనకింకా తెలియలేదన్న విషయం స్ఫురించిందతడికి.

పోర్టికో పక్కన వరసగా నిల్చున్న వృక్షాలు తెల్లజుట్టు ఆరబోసుకున్న ముసలివాళ్లలా కనిపిస్తున్నాయి. మట్టి బాటపైన నడుస్తూ యంజీరోడ్డుపైకొచ్చేశాడు తిలక్. అయిదు నిముషాల సేపు పరుగులాంటి నడకతో వేగంగా ముందుకు కదిలిన తర్వాత ఆగిపోయి గసబోస్తూ వెనుదిరిగి చూశాడు.

రోడ్డుకు రెండువైపులా కమ్ముకున్న వ్యాపార సంస్థల వెనక కాలేజీ భవనాలు కనిపించడం లేదు.

* * *

పట్టణ మేదైతేనేం, పల్లెల్ని మింగి తేన్చుతూ అని నగరమైపోడానికి సన్నాహాలు చేస్తోంది. పేరేదైతేనేం, ఆ నది యేరైపోయి, చివరకు యిసుక పర్రల్ని మిగిలిస్తోంది. నగరపు నరాల్లా వ్యాపిస్తున్న మురికి కాలువలు యెన్నయితేనేం, అన్నీ పొంగి పరవళ్లు తొక్కుతున్నాయి.

04-01-2004, ఆంధ్రప్రభ ఆదివారం